క్లుప్తంగా

బాధ్యతాయుతంగా పనిచేయాలి



ఎమ్మెల్సీ విక్రాంత్‌తో మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ పద్మ

రేగిడి: ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను పాలకొండలోని ఆయన స్వగృహంలో స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన సీహెచ్ పద్మ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె తమకు మళ్లీ ఉద్యోగావకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి, మంచిపేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్సీ కోరారు.

నేడు ఆనవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బాడంగి: మండలంలోని ఆనవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొనే ఈ కార్యక్రమంలో మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

12 నుంచి భవానీ దీక్షలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి భవానీ దీక్షలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, ఈవో పి.శ్యామలరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆలయ 34వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టనున్నామని, 12వ తేదీ నుంచి మండల దీక్ష, అక్టోబర్ 4 నుంచి అర్ధమండల దీక్ష, అక్టోబర్ 15 నుంచి నవరాత్రి ఉత్సవాలు చేపట్టనున్నామన్నారు. విజయదశమి రోజున అమ్మవారి నిజరూప దర్శనం కల్పించడంతో పాటు 25న మాలవిసర్జన కార్యక్రమం ఉంటుందన్నారు.

వర్షంతో ఉపశమనం



బాడంగి గురుకుల పాఠశాల గ్రౌండ్‌లోకి చేరిన వర్షపునీరు

బాడంగి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇన్నాళ్లు వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో ఉదయం 10 గంటలైతే చాలు రోడ్లు మీదకు వచ్చేందుకు జనం భయపడేవారు. మరోవైపు తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బందిపడేవారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించిందని ప్రజలు చెబుతున్నారు.

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామం వద్ద ఉన్న వేంకటేశ్వరాలయం దగ్గర భక్తులకు ఆదివారం అన్నదానం చేశారు. శ్రావణమాసం కావడంతో ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతీ శని,ఆదివారాలు దాతల సహకారంతో అన్నసమారాధన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్నారు. కార్యక్రమంలో మొగిలివలస, వీఆర్‌అగ్రహారం, రాజాం, పాగిరి ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



తెర్లాం జంక్షన్ దగ్గర రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్‌ను తొలగిస్తున్న ఎస్‌ఐ రమేష్

తెర్లాం: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. తెర్లాం-రాజాం, తెర్లాం-బొబ్బిలి ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలు రోడ్డు మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్(తుప్పలు, డొంకలు)ను జేసీబీ సహాయంతో ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా బాగా పెరిగిన తుప్పలు, డొంకలు, చెట్లకొమ్మల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని, జంగిల్స్ తొలగింపు చర్యలు చేపడుతున్నామన్నారు. వాహనదారులు కూడా రోడ్డు మలుపుల వద్ద నెమ్మదిగా వాహనాలు నడపాలని, అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

● అభివృద్ధి 'బాట'..



వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. ప్రధానంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టిసారించిన జగనన్న ప్రభుత్వం ప్రతీ గ్రామంలో రోడ్లు, రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తోంది. దీనిలో భాగంగానే రూ.1.7 కోట్ల వ్యయంతో తెర్లాం మండలంలో లింగాపురం -తెర్లాం(పీహెచ్‌సీ వరకు) బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. గతంలో ద్విచక్ర వాహనాలు కూడా తిరగడానికి వీలుగా లేని ఈ మార్గంను ఇప్పుడు ఏకంగా నాలుగు చక్రాల వాహనాలు కూడా తిరిగేలా రోడ్డును నిర్మిస్తుండడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

\- తెర్లాం

● బాగు'బడి'ంది..



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. దీనిలో భాగంగా రామభద్రపురం మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండల మధ్య ఉన్న లోల్లరపాడు పాఠశాలను దాదాపు రూ.7.5 లక్షల వ్యయంతో ఆధునీకరించారు. కార్పొరేటు స్కూల్‌కు ఏమాత్రం తీసిపోకుండా అత్యంత సుందరంగా కనిపిస్తున్న ఈ పాఠశాల వద్ద పలువురు సెల్ఫీలు దిగి, ప్రభుత్వ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండడం విశేషం. జగనన్న సర్కారు వచ్చిన తర్వాతనే ప్రభుత్వ బడులు బాగుబడ్డాయన్న మాట కూడా సర్వత్రా వినిపిస్తోంది.

\- రామభద్రపురం

● గ్రామస్వరాజ్య సాధనా సౌధం



మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. దీంతో గ్రామగ్రామాన పక్కా భవనాలు శరవేగంగా నిర్మిస్తోంది. ఈ క్రమంలో రాజాం మండలంలోని రాజయ్యపేటలో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామసచివాలయ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. త్వరలోనే దీనిని ప్రారంభిస్తామని పీఆర్ జేఈ ప్రభాకరరావు తెలిపారు.

\- రాజాం

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



బాడంగి: గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దాతలు



తెర్లాం: విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా అపారమైన విజ్ఞానం కలుగుతుందని, చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.

పుస్తకాల వితరణ..

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయానికి రామభద్రపురం మండలంలోని రావివలసకు చెందిన టి.గౌరీశంకర్, బాడంగికి చెందిన వై.శ్రీరామ్ కలిసి పోటీ పరీక్షలకు సంబంధించిన పలు పుస్తకాలను వితరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇదే గ్రంథాలయంలో చదువుకుని, తాము ఉద్యోగాలు సాధించామని, దానికి కృతజ్ఞతగా తమవంతు సాయం చేస్తున్నామని, ఇది తమకు సంతోషాన్నిస్తోందన్నారు. ఈ సందర్భంగా వారికి లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగ యువతను కేంద్రం మోసం చేసింది..



విద్యార్థుల సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శంకరరావు

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రకటించిన కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి పొట్నూరు శంకరరావు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ విమర్శించారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వసతిగృహంలోని విద్యార్థులతో ఆదివారం నిర్వహించిన సదస్సులో మాట్లాడిన వారు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన మోదీ సర్కారు అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని ఆరోపించారు. అలాగే గద్దెనెక్కిన దగ్గర నుంచి వారు చేపట్టినవన్నీ ప్రజావ్యతిరేక విధానాలేనని దుయ్యబట్టారు. నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్ల వ్యవసాయ చట్టాలు, ఇంధన ధరల పెంపు అన్నీ ప్రజాగ్రహం తెప్పించినవేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు అగ్నిపథ్ పేరిట నిరుద్యోగులకు తాత్కాలిక ఉద్యోగాలు కల్పించి, చేతులుదులుపుకునే ప్రయత్నం కేంద్రం చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

6,800 ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యం

బాడంగి: మండలంలో 6,800 ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 5,304 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడిన ఆమె అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో వరినాట్లు వేయడం జరుగుతోందని, మిగిలిన ఎకరాల్లో కూడా రెండు, మూడు రోజుల్లో వరినాట్లు వేయడం పూర్తవుతుందన్నారు. కొన్ని గ్రామాల్లోని వరిపంటకు జింక్ లోపం ఎక్కువగా ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందని, జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని వరిదుబ్బులపై పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడకూడదని, వీలైనంత వరకు సేంద్రియ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



తెర్లాం: పాములవలసలో కాలువల్లోని పూడికలు తీస్తున్న కూలీలు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో వీధి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పూడికలను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. తెర్లాంలో దోమల నివారణకు దోమల నివారణ మందు స్ప్రే చేయించగా, పాములవలస గ్రామంలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, ఈవోపీఆర్‌డీ రాంబాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

రేగిడి: మండలంలోని వన్నలి, చాటాయివలస, వండానపేట, గుళ్లపాడు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఆదివారం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగునిల్వలతో దోమలు పెరిగి, మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శుల పర్యవేక్షణలో కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు.



రేగిడి: వన్నలిలో పారిశుద్ధ్య పనులు

పింఛన్ల పంపిణీ



కొండగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటప్పలనాయుడు

సంతకవిటి: మండలంలోని కొండగూడెం గ్రామంలో పలువురికి కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ కె.వెంకటప్పలనాయుడు చేతులమీదుగా ఆదివారం పంపిణీ చేశారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పింఛన్లు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలని లబ్ధిదారులు అన్నారు.

మట్టి ప్రతిమలు.. పర్యావరణానికి మేలు..



పంపిణీకి సిద్ధం చేసిన మట్టి గణపతుల వద్ద కృష్ణదాస్ మాస్టారు

బొబ్బిలి: మట్టి ప్రతిమలే పర్యావరణానికి మేలు చేస్తాయని, వినాయక చవితికి అందరూ మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే వినియోగించాలని వనమిత్ర సంఘ అధ్యక్షుడు కె.కృష్ణదాస్ మాస్టారు కోరారు. స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన రాబోయే వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని, పంపిణీకి మొత్తం 1000 వినాయక ప్రతిమలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మట్టి గణపతులు వినియోగించడం వల్ల పర్యావరణ, జలకాలుష్యం తగ్గుతుందన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



రాజాం: ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు

రాజాం: స్థానిక పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో బావిరేవతమ్మ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు చేతులమీదుగా ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం పునాదిరాయి వేసి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా పాత ఆలయాన్ని కాస్త వెనక్కి విస్తరించి, కొత్తగా నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, సి.జయరాం, పి.ఎరకన్న, బి.మల్లిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సంతకవిటి: సూరమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల సందడి



రేగిడి: భక్తులతో కిక్కిరిసిన అంబఖండి అయ్యప్ప స్వామి ఆలయం

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని, అయ్యప్పస్వామికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబు శర్మ, వంశీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం..

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో సూరమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి గుండం ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలంతా అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన



అగ్రికల్చర్ విద్యార్థులకు అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ఏపీ స్టేట్ నేచురల్ ఫార్మింగ్ కో-ఆర్డినేటర్ రవి

రేగిడి: మండలంలోని గుళ్లపాడు గ్రామంలో ఉన్న భాస్కర ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎస్‌కేవై వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, వాటి ప్రయోజనాలను ఏపీ స్టేట్ నేచురల్ ఫార్మింగ్ కో-ఆర్డినేటర్ దార్లపూడి రవి తెలిపారు. అనంతరం జీవామృతం, అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే సేంద్రియ ఎరువుల వల్ల కలిగే లాభాలు, రసాయనిక ఎరువుల వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బొబ్బిలి: చెరువు గట్టుపై మొక్కలు నాటుతున్న చైతన్య యువజన సేవాసంఘ సభ్యులు

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శిష్టకరణ సంక్షేమ సంఘం రాజాం ప్రాంతీయ అధ్యక్షుడు పక్కి వాసు అన్నారు. మండలంలోని మెంతిపేట దగ్గరున్న శిష్టకరణాల కమ్యూనిటీ హాల్ వద్ద పలు కుటుంబాలకు ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. మరికొన్ని మొక్కలను కమ్యూనిటీ హాల్ వద్ద నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి దానిని సంరక్షించాలన్నారు. శిష్టకరణ సంక్షేమ సంఘం కుటుంబాల ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక అభివృద్ధిలో కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాల్లో సంఘ సభ్యులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కుప్పిలి రమేష్, వైస్ ప్రెసిడెంట్ కల్లేపల్లి శ్రీనివాసరావు, ఉరిటి జగదీశ్వరరావు, బలివాడ నాగేశ్వరరావు, కొండవలస మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని కృష్ణాపురంలోని చెరువు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా చైతన్య యువజన సేవా సంఘం సభ్యులు పలు మొక్కలు నాటారు. సంఘ అధ్యక్షుడు చుక్క శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ నేస్తాలని, మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమన్నారు. మొక్కల పెంపకానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట సింహాచలం, చుక్క సత్యంనాయుడు, సర్వసిద్ధి గౌతమ్, రఘు, సురేష్, బాలాజీ, శివ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

● సహస్ర దీపారాధన



రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న మణికంఠస్వామి ఆలయంలో సహస్ర దీపారాధనలు ఆదివారం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చాలామంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అయ్యప్పస్వామికి దీపారాధన చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



రామభద్రపురం మండల కేంద్రంలోని చొక్కాపు వీధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

రామభద్రపురం: మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామగ్రామానికి వెళ్లిన ప్రజాప్రతినిధుల దృష్టికి అక్కడి సమస్యలను గ్రామస్తులు తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలోని అభివృద్ధి పనులకు రూ.20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో చాలాచోట్ల సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం ఊపందుకుంది. ఇదిలా ఉండగా, ప్రస్తుతం రామభద్రపురం మండల కేంద్రంలోని మూడు సచివాలయాల పరిధిలో దాదాపు రూ.60 లక్షల నిధులతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.